("జ్యోతి" మాసపత్రిక—జనవరి 1970)

పృథ్వీపతి

రెండు రోజులైంది; కలెక్టర్ మధుసూదన్ ఈ జిల్లాలో ఛార్జి తీసుకొని. ప్రముఖులంతా వొచ్చి పరిచయాలు చేసుకోడం అయింది. ఆఫీసుకి సంబంధించిన వాళ్ళు ఒక్కొక్కళ్ళూ వొచ్చి దర్శనాలు చేసుకోడం ఇంకా అవుతూనే ఉన్నాది. నిన్న సాయంకాలం వెల్కమ్ పార్టీ ఫొటో, నిన్నరాత్రి ఆఫీసర్స్ క్లబ్ డిన్నరు యిచ్చింది.

ఇవాళనించీ "రొటీన్ వర్క్" కూడా మొదలెట్టాలి.

మొట్టమొదటి ఫైల్ తెరవగానే "అబ్బా!" అని కుర్చీలో వెనక్కి చేరబడిపోయాడు. "అప్పుడే శిక్షలు మొదలా?" అని విసుగు కలిగిందతనికి.

ఎవ్వణ్ణీ దగ్గిర్నించి పరిశీలించి చూడడానికి వీల్లేదు. పరిచయంవున్నా పరధ్యానం నటించాలి, వీసమెత్తు పొరపాటు జరిగినా "నీ ఉద్యోగం ఎందుకు తీసెయ్యకూడదు? నీ ఇంక్రిమెంటు యాడాదిపాటు ఆపీగల్ను జాగర్త. నిన్ను చావగొట్టి చెవులు ముయ్యాలనుందోయ్" అంటూ కాయితాలు సంతకాలు చెయ్యాలి.

గుమస్తాలూ, శిరస్తాదారూ, పెరసనల్ అసిస్టెంటూ వీళ్ళందరూ ఆ కాగితాలన్నిట్లోనూ వాద ప్రతివాదాలు జాగర్తగా కూర్చిపేర్చి సారాంశాన్ని తేర్చుతారు. ఎవడిమీదికో గాలి పోగుచేసి ధూళి రేపుతారు. అందువల్ల ఎవరికీ నష్టం రాదు. కాని ఆఖర్ని తనుపొడిచే కలంపోటు మాత్రం వాడి గుండెల్లో గునపంపోటు అయిపోయి, ఆ దెబ్బకి వాడి పెళ్ళాం పిల్లలూ వీధిని పడిపోతారు.

వీడెవడో కృష్ణమూర్తిట. నాలుగు నెలలపాటు వరసగా వాడి పెరసనల్ రిజిష్టర్లు ఆలస్యంగా పుటప్పు చేసేడుట. వాడికి ఆరు నెలలపాటు ఇంక్రిమెంటు ఆపెయ్యాలని ఆ తడాఖా సర్వీసంతా ప్రతీ ఏడూ నష్టం వొచ్చేటట్టు చెయ్యాలని—ఆ ఫైల్లో గ్రంథం నడిచింది.

"ఈ కృష్ణమూర్తిని నేను చూడాలి" అనుకున్నాడు కలెక్టర్ మధుసూదన్.

ఫైలుమీద "ఇరవై రోజుల తర్వాత దీన్ని నాకు పంపండి" అని వ్రాసి

డఫేదార్ని కేకేసి, "బి.ఫైవ్-కృష్ణమూర్తి-ట—నేను రమ్మన్నానని కబురుపెట్టు' అన్నాడు.

* * *

"నమస్కారం సార్."

"ఊఁ....ఎస్!"

"నేను కృష్ణమూర్తిని సార్. బి. ఫైవ్."

కృష్ణమూర్తిట....ముప్ఫై నాలుగేళ్ళట. అతనికి .... ఇరవై నాలుగేళ్ళు కూడా లేవా అన్నట్టున్నాడు....తెల్లగా, ఎక్కడా పుట్టుమచ్చ కూడా లేని రంగు. తిన్నగా పోతపోసినట్టున్న విగ్రహం. నల్లగా ఒత్తుగా ఉంగరాలు తిరిగిన తల, బిరుసుగా పొగరుబోత్తనంతో మెరుస్తున్నాది.

కృష్ణమూర్తి....కృష్ణమూర్తే .... ఆర్. కృష్ణమూర్తి కాబోలు- ఫెమిలియర్ నేమ్-

అప్పను....

కృష్ణా....ఆర్. ఎమ్. కృష్ణా.... మేగాడ్ ఫర్బిడ్....బి.ఎస్సీ ఆనర్స్ చదివి ఇతగాడిక్కడ యూడీసీగా అఘోరిస్తున్నాడా?....క్యూములేటివు ఎఫెక్ట్తో ఇంక్రిమెంట్ స్టాప్ చెయ్యాల్సింది ఇతనికేనన్నమాట!

"ఎస్....వాట్ మేడ్ యు కమ్ హియర్?"

"కబురు చేసేరుట."

"ఐసీ!....సో-నువ్వు కృష్ణమూర్తా? నీ సబ్జక్ట్ ఏమిటి?"

"అబ్కారీ;గన్ లైసెన్సెస్, మునిసిపాలిటీ ఏక్ట్!"

"ఆల్రైట్!ఇదిగో, ఈ ఫైల్ చూసేవా! దీంట్లో నీమీద రివర్షన్కి చాలినంత మెటీరియల్ ఉంది.అయినా నేనిప్పుడేమీ ఆర్డర్సు వెయ్యడంలేదు.నీ కిరవై రోజులు టైమ్ యిస్తున్నాను. ఈలోగా నువ్వు బుద్ధికలిగి జాగర్తగా పనిచేసుకున్నావా, సరి.... లేకపోతే"

"థాంక్యూసార్"

"బై ది బై! నిన్ను నేనెక్కడైనా చూసేనా?"

కృష్ణమూర్తి మొహాన ఇంతసేపూ దాగిన చిరునవ్వు గలగలా చప్పుడు చేస్తూ బైటపడింది. ఆ చప్పుడు వింటే పాత జ్ఞాపకాలొస్తున్నాయి.

"ఫెమిలియర్ నోయిస్—"

సముద్రపు కెరటాలు బండరాళ్ళ మీద కొట్టుకునేటప్పుడయ్యే చప్పుడు. కర్రభరిణలోంచి గవ్వలు సిమెంటు గచ్చుమీద ఒంపినప్పుడయ్యే చప్పుడు, ఆహ్లాదంగా వుండకపోయినా ఏదో చిత్రంగా వుంటాయి కొన్ని శబ్దాలు. అలాంటి వాటిల్లో కృష్ణమూర్తి పకపక నవ్వేటప్పుడయే చప్పుడుని చేర్చొచ్చు. అది పాత పరిచయపు ధ్వని....

సందేహం లేదు....ఆ. రెమ్. కృష్ణా!

"చూడ్డంకాదు సార్—మనిద్దరం వాల్తేర్లో ఆంధ్రా యూనివర్శిటీలో సద్ధర్మ సదన, రూమ్ నెంబరు అరవై ఆర్లో—"

"మై....గాడ్!"

"మూడు రోజులుగా సెలవులో ఉన్నానండి....అందువల్ల తమరు కబురు పెట్టేదాకా దర్శనం చేసుకోలేకపోయాను."

"ఇటీజ్ ఆల్‌రైట్!"

* * *

"వాడికి కబురుపెట్టి ఇంటర్‌వ్యూ ఇచ్చార్టగా!....వాడి సంగతి మీకు తెలీద్సార్! ఈ కలెక్టరేటుని కొండచిలవలాగ చుట్టుకుని ఒదలకుండా వున్నాడుసార్. తిన్నగా పనిచెయ్యడు; ట్రాన్స్ఫర్ చేస్తె పోడు. వూళ్ళో కట్టెల అడితీ ఊరి పక్కనే పొలం. వూళ్ళో సొంత యిల్లూ సినిమాహాల్లో షేర్లూ, అందరూ తెలిసిన వాళ్ళు, అత్తారు కూడా యీ వూరే....వాడు తెచ్చే ఇన్‌ఫ్లూయన్సులకి, రికమండేషన్లకి, కానుకలకి ఇక్కడికి ఇదివరకొచ్చిన ఐ.ఏ.యస్. ఆఫీసర్లందరూ ఎలాగో లొంగిపోయేరు. మీరే వాణ్ని ఓ పట్టుపట్టాలి సార్." అని పి.ఏ. చెప్పేడు.

"సరే-సరే—" అన్నాడు కలెక్టరు.

మధుసూదన్ ఇంకా చాలాసేపు "వాణ్ని" గురించి ఆలోచించేడు."వాడేం నే నెరగని కృష్ణమూర్తా! వాణ్ని గురించి మీకన్నా నా కెక్కువే తెలుసును.... ఏ మొగల్ పాదుషానో మళ్ళీ యిలా పుద్భవించి వుంటాడు—అంత విలాస పురుషుడు వాడు. వాడికి చదువుకొనేటప్పటికే—వేలది. పానంబు జూదంబు అంటూ చెప్పిన సప్త వ్యసనాల్లో మొదటి మూడూ అబ్బేయి. ఇప్పుడూ ఉండే ఉంటాయి. అడ్డం వొచ్చిన వాళ్ళందరికీ ఎవడి యోగ్యతనిబట్టి వాడికి చేతికీ మూతికీ పారేస్తూనన్నిలా అనుభవించనియ్యండర్రా అనడం వాడి విద్య.మీరంతా తినే వుంటార్లెండి...."

"వాడొక ఫ్రీబర్డ్!" అనుకున్నాడు మధుసూదన్.

"పరాకళ్ళకయితే వాడికున్న ఆ స్వేచ్ఛ; అనుభవించడానికి ఆ యోగ్యత ఎలా వస్తాయి?"

"వాడితో పోలికే లేదు!"

"మనదంతా జైల్లో జీవితంలాగ మరీ రొటీన్. అంతా యాంత్రికంగా జరగాలి. ప్రోగ్రాం ప్రకారం, టైం ప్రకారం, ఎక్కడా తేడా రాకూడదు. ఎక్కడా ఎప్పుడూ ముందూ వెనకా తొంభయిమంది కాపలా. వేసే ఆర్డర్సుకీ చేసే పన్లకీ అందరూ చెప్పగలిగినన్ని రూల్సూ సలహాలూ వుంటాయి. ఏ మాత్రం పక్కకిపోయినా అందరూ వింతగా చూస్తారు.

"నాకైతే అసలు స్వేచ్ఛ అనేదే లేదు....బొంబాయిలో కస్టమ్స్ డిపార్టు మెంట్లో ఉండేవాణ్ణి-అప్పుడే నయం కావలసినంత స్వేచ్ఛ వుండేది. సంపాదన; విలాసం; భోగం. అన్నీ వుండేవి. డ్యూటీదిగి వెళ్ళిపోతే చీకట్లోకి వెళ్ళి పోవచ్చు. చీకట్లో అంతా తమాషాగా వుంటుంది. ఎప్పటికప్పుడు కొత్తగా థ్రిల్లింగ్‌గా; సుఖంగా, ఎన్నో దేశాల మనుషుల్తో పరిచయం, స్నేహం, సంపర్కం....స్వరాష్ట్రంలో వుండే సదుపాయంకోసం అవన్నీ వొదులుకొని యిలా వచ్చేసేను.

"ఇక్కడ నే నెప్పుడూ నేనుకాదు. ప్రజలకి, ప్రజా ప్రతినిధులకి సాధన సామగ్రిలాగ చేసిసేరు ఈ ఉద్యోగాన్ని. ఎవడెవడో ఎప్పుడెప్పుడో వచ్చేస్తాడు. ఏ క్షణంకూడా నా యిష్టం లేదు.

"నాకు సినీమా చూడాలని వుంటే ముందుగా నా పి.ఏ.కారో, క్యాంపు క్లార్కో హాలు యజమానికి కబురుచేస్తారు.వాడేమో "అన్నీ సరిగా" ఉన్నాయో లేదో చూసుకుని, జాగ్రత్తపడి నాకోసం బోలెడు ఏర్పాట్లు చేసేస్తాడు. పోలీసు సూపరెంటుగారు ఓ అరడజనుమంది జనాన్లని వీలైతే ఒక యినస్పెక్టరుతో సహా అక్కడి డ్యూటీమీద వుంచేస్తారు.

"నేను రోడ్డుమీద కార్లో వెడుతూ నా యిష్టం వచ్చిన దగ్గర అయిదు నిమిషాలు ఆగి అక్కడ జరుగుతూవుండే వింతనే చోద్యాన్నో లేక గలాటానో గమనించవచ్చునా? వీల్లేదు వీల్లేదు. నేను తీర్పుకేగాని సాక్ష్యానికి పనికిరాను. నేను ఎక్కడేనా నిలబడ్డానంటే అక్కడ మామూలు జీవితం అంతా స్థంభించి పోతుంది.

"నేను చిన్నప్పటిలాగ హోటలుకి వెళ్ళి నాకు బాగా నచ్చే దేదైనా హోటలు సెర్వరుతో తగాదా పెట్టుకుంటూ వాణ్ని కిందామీదా పెట్టి తినడానికి వీలుంటుందా? ఉండదు. నా డఫేదారు పర్మిషన్ లేకుండా నేను వచ్చి మంచి నీళ్ళుకూడా తాగడానికి వీల్లేదు. హెడ్‌క్వార్టర్స్ ఆర్. ఐ. అసలు ఒప్పుకోడు.

"నాకెవరైనా గరల్ ఫ్రెండు ఉన్నాదనుకో ఆవిణ్ని నేను నా యిష్టం వచ్చినట్టు కలుసుకోవచ్చా?....నాతోబాటు యం. ఏ. చదివిన సునంద ఈ ఊరి వుమెన్సు కాలేజిలో ఇంగ్లీషుకి హెడ్డాఫ్ ది డిపార్టుమెంట్‌గా వున్నాదిట.ఆవిడా నేనూ తరుచుగా కలుసుకోవాలని వుంటుంది. కబురుపెట్టి వెళ్ళవచ్చును. కాని అంతా కృత్రిమంగా వుంటుంది. కబురు పెట్టకుండా నా జీప్ నేను డ్రైవు చేసుకు వెళ్ళొచ్చు. కాని అదీ కృత్రిమంగానే వుంటుంది. నేనెక్కడుంటే అక్కడ వాతావరణం సహజత్వాన్ని కోల్పోతుంది.

"నన్నుగురించి తెలిసిన వాళ్ళు తెలియని వాళ్ళు అంతా అంతులేని విస్పరింగ్ కాంపైన్ నడుపుతారు. వీళ్ళంతా నాకు కావలసిందాన్ని నాక్కావలసినప్పుడు నన్ను అనుభవించ నిస్తారా? ప్రేక్షకులు లేకుండా నేనొక్కపని అయినా చెయ్యగలనా? ఒక్క కోర్కె అయినా తీర్చుకోగలనా?___"

అని ఆవేదనలో పడ్డాడు మధుసూదన్.

"వాట్ కృష్ణమూర్తి? ఏమిటంటావు?"

"నన్నడిగితేనండి — డ్యూటీని అలా మోస్తూ కూర్చోకూడదండి. డ్యూటీ దిగిపోగానే___"

"నా అంత పెద్ద ఆఫీసరు డ్యూటీ దిగిపోవడం అనేది వుండదేమో."

"అలా ఎందుకనుకోవాలి? ఎవరికి నచ్చిన అండర్ వరల్డ్ వారు తయారు చేసుకుంటూనే వుంటారే! అడ్జస్ట్ చేసుకోడంలో ఉంటుందనుకుంటానండి".

"ప్రయత్నంచేసి చూడాలి. ఈ మొనాటనీతో నాకు బోరు కొడ్తోంది."

* * *

"కలెక్టరుగారు నాకొక చిన్న ఉపకారం చేసిపెట్టాలి."

"అదేమిటి కృష్ణమూర్తి ఆ భాష!?....సారీ....ఎవరో వొచ్చారా. నీకూడా!....ఎస్!?"

"ఈ అమ్మాయి___"

"నమస్కారం సార్."

ఇరవై ఏళ్ళ అమ్మాయి అందంతో, చురుకుతనంతో, ఆమె అవయవాలు, కళ్ళు మెరిసిపోతున్నాయి....వాటేఫిగర్ !.... ఈ అమ్మాయికి ఉపకారం చెయ్య గల్గిన పరిస్థితిలో ఉన్నందుకు నాకు కంగ్రాచులేషన్స్-

కూర్చోమన కూడదు........

"ఈ అమ్మాయి—పేరు రాజేశ్వరి—కలెక్టరాఫీసులో టెంపరరీగా ఒక టైపిస్టు ఉద్యోగం ఖాళీవొచ్చింది— ఈమె అప్లై చేసిందిసార్, కలెక్టర్‌గారి దర్శనానికి వచ్చింది—"

"ఐసీ—మీ బంధువా?"

కృష్ణమూర్తి ఆ ప్రశ్న అనవసరం అన్నట్టు నవ్వేడు "బంధువులాంటిదే నండి! వీళ్ళసిస్టరూ నేనూ క్లాస్‌మేట్స్—"

"వీళ్ళ సిస్టరా?....ఆవిడెవరు?"

"....ఆవిడ—రమణమ్మగారని జెనరల్ హాస్పిటల్ వర్క్ చేస్తున్నది. డాక్టరు కాదండి....మాకు నైబర్ కూడాను."

"ఐసీ—సరే—పి.ఏ గారు చూస్తారనుకుంటాను ఆ వ్యవహారాలు—తరవాత కనబడమను—"

* * *

"క్లియోపాత్రాలాగున్నాది, దానికి మన ఆఫీసులో ఉద్యోగం ఖర్మ ఏమిటోయ్ కృష్ణమూర్తి?

"నేనదృష్టవంతుణ్ని సార్. ఈమె కుడా మీకు నచ్చదేమో అని భయ పడి పోయాను!

* * *

డర్టీఫెలోస్! వెధవ కాయితాలూ వీళ్ళూను! రొటీన్స్. రొటీన్, అంతా రొటీన్! స్పైస్‌లెస్ మొనాటనీ; మార్పులేని మందకొండి జీవితం!-ఏమిటిది?- సెలవు కావాలిట. బ్రదర్స్ మ్యారేజీ - పెళ్ళిళ్ళెందుకో! రెఫ్యూజ్డ్....ఇదేమిటి? - ప్రమోషన్....ఈ ఏడాది లిష్టులో ఒద్దు .... ఈ చెత్త ఫైలు దేనికో?- ఎవడో రికార్డులోఫైలుదాచేసేడని చార్జి,పర్మనెంటుగా రివర్టుచేసి పారేస్తేసరిపోవనీ వెధ వలు....ఏమైపోయింది రాజేశ్వరి?కృష్ణమూర్తి కనపడ్డేం?

ఈ ఫైలేమిటి? - బోర్డుమెంబరు వస్తున్నాడు - ఆయనగారు క్యాంపులో అడిగే విషయాలమీద అంకెలు - అన్ని కాపుల లెక్కలు, ఇలాంటివి ఫైల్లోకట్టి పంపేస్తే ఎలాగ? - బ్రింగ్!

కృష్ణమూర్తి ఫైల్సేమిలేవా?.... యస్. కృష్ణమూర్తీ—స్పీక్! స్పీక్ ఎబౌట్ మై స్వీట్ ఫ్రెండ్ !....బ్రింగ్! బ్రింగ్ దట్ నైస్ క్రీచర్ ఎగైన్. ఒక్కసారి వచ్చి వెళ్ళిపోయింది. ఈ కృష్ణమూర్తిగాడొకడు— కబురు పెడితేనే గాని కనబడి చావడు.

"ఏమయ్యా—ఏం వచ్చావు?"

"ఈ ఫైల్లో స్పీక్ రాశారుసార్"

"ఐసీ—"

"దీంట్లో కాంప్లికేషనేమీ లేదుసార్....ఆర్డరు వేసెయ్య వచ్చునండి—"

"—వెధవ ఫైల్సూ వెధవ ఆర్డర్సూ నువ్వూ—

"అయ్యా—"

"అదెవరో అమ్మాయికి ఉద్యోగం కావాలన్నావుగా"

"తమ చిత్తంసార్, కాని ఆ అమ్మాయి యస్సెల్సీ పాసవలేదుట సార్. టైపుమాత్రం చెయ్యగలదు."

"వంట వచ్చునా?"

"ఒచ్చుసార్.

"నా మిసెస్‌కి ఒక లేడీ అసిస్టెంట్ కావాలి....కొన్ని నెలలే అనుకో—ఆ మధ్య వచ్చినావిడ—షి ఈజ్ వెరీ ఇరెగ్యులర్....షి ఈజ్ ఓల్డ్ ఆల్సో—"

"సర్—"

"ఒకసారి ఆమెనివచ్చి నా మిసెస్‌కి కనబడమను. రేపో ఎల్లుండో జాయిన్ కావచ్చు."

"సరేసార్"

"జాగర్త"

"ఎంతమాట సార్! నాకామాత్రం తెలీదా?"

* * *

"నమస్కారం సార్."

"ఎవరది?—ఏమిటీ—మిస్ రాజేశ్వరి? ఏమిటి, ఇలా వచ్చేవు? నిన్ను ఆఫీస్ రూమ్ దగ్గరికి పంపించెవరు?"

"నేనే వచ్చానండి. ఆఫీస్ పనిమీదేనండి"

"ఐసీ, వాట్ కెనైడూ ఫార్యూ?"

"బందల పత్రులో బంజర్లు పంచి పెడుతున్నారటగా, మా చిన్నాన్నా గారు అప్లికేషన్ పెట్టుకున్నారండి, పదెకరాలు వారికి గ్రాంటు చేయిస్తే— మీ పేరు చెప్పుకుని బ్రతుకుతారండి."

"అరె! ఏమిటో అనుకున్నాను.... నీకు మాట్లాడడం కూడా వచ్చునే!.... ఆల్‌రైట్! ఐ విల్ డూ ఇట్."

*　　　*　　　*

"సార్!"

"ఓ'—రాజేశ్వరి—ఏమిటది?"

"——ఈ చీటీమీద పేరు రాసి వున్నాయన మా మేనమామగారి అల్లుడండి. నారాయణపేట తాలూకా ఆఫీసులో ఎనిమిదేళ్ళబట్టి మగ్గిపోతున్నాడండి. ఈ వూరికి ట్రాన్స్‌ఫరు చేయించమని ప్రాణం తీస్తున్నాడండి."

"అంటే?....నువ్వు ఇలాంటి పనులు చేసిపెట్టగలవని అతనికెందుకు తెలిసింది?"

"ఎంతమాటన్నారండి సార్!....నేను కలక్టరుగారి వంటమనిషినని ఎవరికీ తెలియదంటారా సార్?

"ఐసీ! మరి అమ్మగారితో చెప్పావా?"

"తమరు చెప్పమంటే చెబుతానండి."

*　　　*　　　*

"సూరారెడ్డిగారు సార్.గోవిందపురం యువజన సంఘం ప్రెశిడెంటుగా వుండి చాలా మెప్పుదల అయిన పనులు చేశారండి."

"ఐసీ—కూర్చోండి"

ప్రస్తుతం వారు తమ దర్శనానికి ఒక పనిమీద వచ్చేరండి"

"గో ఎ హెడ్ !"

"కొత్త సిమెంటు ఫ్యాక్టరీ విషయమై గవర్నమెంటు రిపోర్టు పోతుంటట కదండి. దానికి సైట్‌గా ఈయన భూమిని రికమెండ్ చేయాలని తమర్ని కోరడానికి వచ్చేరు."

"గట్టిగా చెప్పలేను మిస్ రాజేశ్వరి! క్రిందినుంచి రిపోర్టులన్నీ ఎలా వచ్చేయో చూడాలి."

"తమరు దయతలిస్తె క్రిందవార్ని ఆకట్టుకోడం ఎంతసేపండి"

"సరే చూద్దాం వెళ్ళండి"

"…………"

"వెళ్ళాడా!"

"వెళ్ళాడండి"

"ఇటు చూడు మిస్ రాజేశ్వరి! ఈ వచ్చిన పెద్దమనిషి—

"సూరారెడ్డండి"

"అది చెప్పావు—నీ కెలా పరిచయం—?"

"…………"

"పరిచయం కూడా లేదన్నమాట"

"ఉన్నదండి"

"ఎలాగ?

"మా అక్కకి పొలముందండి. అది ఇతనే చేస్తున్నాడు—"

"నువ్వూ నీతోబాటు మీ అక్కా. ఆవిడతో ఆవిడభూమి చేసే సూరారెడ్డి ఇంతమంది నా ఎడ్మినిస్ట్రేషన్లోకి రావడం బాగాలేదు. నీ కిదివరకే నాలుగైదుసార్లు చెప్పాను—

"ఈ ఒక్కటీ చేసిపెట్టండయ్యగారూ. ఇంక అడగను"

"అడగవని ఎలా రూఢి?"

"అడగనంటే అడగనండి!"

"అయితే యిదే ఎందుకు మానయ్యరాదు?"

"చెప్పాలా, సార్?"

"చెప్పు—"

"అక్క ఈయనదగ్గర వెయ్యిరూపాయలు అప్పు పుచ్చుకుని నగచేయించుకుందండి—తొందర చేస్తున్నాడు—"

"ఈ పని చేయించిపెడితే ఆ వెయ్యి అడగడం మానేస్తాడు. అంతేగా"

"అయ్య"

"నో—నాచేత తప్పుడు పనులు చేయించడానికి మీరు లంచాలు కూడా పుచ్చుకుంటున్నారన్నమాట."

"అంతంత మాటలంటే నేనం చేసేదండి?"

"నో గో—నేనిలాంటి పనులు చెయ్యను. నువ్వు వెళ్ళిపో—"

"ఇంటికి వెళ్ళిపోతున్నానండి: అమ్మగారికి చెప్పేసి—"

"యూ, బిచ్!"

కలం కిందపడి విరిగిపోయింది. సిరా నేలమీద అసహ్యంగా మరక కట్టింది.

*　　　*　　　*

"హలో-కలెక్టర్ స్పీకింగ్ !....ఎవరు? పి. ఏ. గారా? నమస్కారం, నమస్కారం—ఎవరు? యూడీసీ కృష్ణమూర్తినా? ఎరెస్టు చేసేరా ? .... నాన్సెన్స్!....వారంట్ ఉంది కాబోలు.... ....ఐసీ-జామీను ఎవరేనా వుంటే వాళ్ళే వచ్చి విడుదల చేయించుకుంటారు—మనం ఇంటర్ ఫియర్ కానక్కర్లే దేమో-పోలీస్ సూపరెంట్ అలా అనుకున్నారా?....రిడిక్యులస్-నేనా, ఔట్ ఆఫ్ ఆల్ పీపుల్....ఏమిటి ఈ ఇన్వెస్టిగేషన్? స్మగ్లింగ్ అఫ్పైన్‌తో ఇతనికి. సంబంధం వుందా! చాలా ఆశ్చర్యంగా వుందే-థాంక్యూ."

*　　　*　　　*

రివిన్యూబోర్డు ఆర్డరు ప్రకారం కలెక్టరు మధుసూధన్‌కి ట్రాన్స్ఫర్ అయింది ఆర్డరు వచ్చిన అయిదోరోజున రిలీవు అయి. పదమూడోరోజున కొత్తచోటజాయిన్ అయ్యాడు మధుసూధన్.

*　　　*　　　*

"నేను జామీనుమీద విడుదలయ్యాను సార్. ఎన్‌క్వైరీవస్తే నా ఉద్యోగం పోతుంది. పోనివ్వండి. నాకేదో దేవుడిచ్చింది ఇంతవుంది; అదే చాలు. కాని ఆ సి.బి.ఐ. వాళ్ళు దేవాంతకులు సార్. వాళ్ళ నోళ్ళు ముయ్యడానికి బ్రహ్మాండం బ్రద్దలైపోతోంది సార్. వాళ్ళు ప్రతి ఇష్యూలోను మిమ్మల్ని నాతోపాటు మిక్సప్ చేస్తున్నారు. మీ అండ చూసుకుని నేను విజృంభించేనని వాళ్ళ రికార్డు. దఫేదార్ని ప్యూన్స్‌ని అందర్నీ ఎన్‌క్వైర్ చేసేరు....ఎంత మందినని నోరుముయ్యటం-చచ్చిపోయాను సార్."

"ఓ! వెరీసారీ!"

"మీపైన ఈ రాజేశ్వరీ ఎఫైర్ రుజువు కాలేదులెండి. అది ప్రూఫ్ అయితే ఆవిడద్వారా కొన్ని ఎట్రాసిటీస్ జరిగాయని ఛార్జి వచ్చేదే-ఎలాగేనా కొన్ని-అదే బంజర్ల పంపకం -శ్టాప్ పనిష్మెంట్సు ట్రాన్స్ఫర్సు-కొన్ని పితూరీలు గవర్నమెంటుకి పోయాయిసార్. మీకు తెలుసో లేదో-"

"ఐసీ-తెలీదు"

కాని, ఏం పరవాలేదు సార్. సూరారెడ్డికి మీరు బోలెడు హెల్పుచేసేరు. వాడి బ్రదరు నారాయణరెడ్డికి మినిస్ట్రిలో మంచి పలుకుబడి వుంది. నేను ఇక్క-

ఇక్కడనుంచి తిన్నగా హైదరాబాదు వెళ్ళి అవన్నీ డ్రాప్ చేయించేస్తాను. సూరారెడ్డి కూడా ఈసరికి హైదరాబాదుకు చేరుకుని వుంటాడు."

"చాలా థాంక్స్ కృష్ణమూర్తి. మెనీ మెనీ థేంక్స్. నువ్వు లేకపోతే ఇదంతా—"

"ఏం లేదుసార్. ఇదంతా నా డ్యూటీ.

*　　　*　　　*

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీగారికి

నమస్కారం.

జిల్లా కలెక్టరుగా నేను డ్యూటీలో వుండి ఉద్యోగస్తులకు, ప్రజలకు ఇతర దరఖాస్తుదారులకు, కొన్ని తప్పుడు ఆర్డర్లు జారీచేసినట్లు, వాటివల్ల నష్టం పొందినవారు నాపైన, లేదా నా ఆర్డర్లపైన ప్రభుత్వానికి వినతులు, ఫిర్యాదులు పంపుకొన్నట్లు తెలిసినది. చాలా సంతోషంతో ఈ సవాలును స్వీకరిస్తున్నాను.

"నా విష్ణుః పృథివీ పతిః" అని సంస్కృతంలో ఒకనుడి. విష్ణు అంశ లేనివాడు పాలకుడు కాలేడని దాని అర్థము. పాలన నా చేతిలో వుండినప్పటికి, ప్రభుత్వము నన్ను పరీక్షించి బాధ్యతగల ఉద్యోగానికి తగినవాడనని నిర్ణయించినప్పటికి, చిత్త చాంచల్యము వల్ల, బలహీనతలకు లొంగి నేను దారి తప్పినమాట నిజము. అనాలోచితంగా అధికార దుర్వినియోగం చేసినమాట నిజం.

బాధ్యతగల ప్రభుత్వోద్యోగి తనకు నచ్చినదారిని వెళ్తే ప్రజలకు నష్టంవచ్చే పరిస్థితి ఏర్పడినప్పుడు స్వంత విషయాల్లోకూడా చాలా నిబంధనలు పాటించాలన్న విషయం నాకు అవగాహన అయింది. తప్పుచేసే మనిషి స్థాయినిబట్టి తప్పు పరిమాణం పెరుగుతుందని నేను గుర్తిస్తున్నాను. మామూలు మనిషి చేసే తప్పులే, జిల్లా కలెక్టరుగా వుండి నేను చేయడంవల్ల చాలా పెద్దే తప్పులయిపోయి విపరీత పరిణామాలకు దారితీసింది.

నేను చేసివున్న తప్పులకు ప్రాయశ్చిత్తంగా నేను నా ఉద్యోగానికి రాజీనామా యిస్తున్నాను. అంగీకరించ ప్రార్థన.

ఇట్లు
మధుసూధన్